సాక్షి
నిర్మల్

సోమవారం । 7 । ఆగస్టు । 2023



ఆధునిక హంగులతో రైల్వే అభివృద్ధి

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఏబీఎస్ఎస్ కింద ఎంపికైంది. ఇందులో భాగంగా ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. 8లో▸



వరద తెచ్చిన కష్టాలు

దస్తురాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరద తాకిడికి మండల కేంద్రంలోని గోదావరి తీర ప్రాంతంలో విద్యుత్ స్తంభం నేలకు ఒరిగింది. దానిచుట్టూ చెత్తాచెదారం ఆగడంతో రైతులు ఇలా అష్టకష్టాలుపడి స్తంభాన్ని వెలికితీస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
31.4 /24.6

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా అనిపిస్తుంది. ఒకటి రెండు చోట్ల చినుకులు పడతాయి.

న్యూస్‌రీల్

విఠల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్



ఎమ్మెల్యేను అభినందిస్తున్న సీఎం కేసీఆర్

భైంసా(ముధోల్): ముధోల్ ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ విఠల్‌రెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే సోయం బాపురావులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బాసర ఆలయంలో పూజలు

సర్పంచ్ లక్ష్మణ్‌రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోర్వ శ్యామ్, నాయకులు నూకం రామారావు, జ్ఞానిపటేల్ బాసర సరస్వతీ ఆలయంలో పూజలు చేశారు.

జయశంకర్ సార్ అడుగు జాడల్లో నడవాలి

- మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్



నివాళులర్పిస్తున్న చైర్మన్, నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సూచించారు. ఆదివారం జయశంకర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని తెలంగాణకు అంకితం చేశారన్నారు. జయశంకర్ సార్ బాటలో సీఎం కేసీఆర్ నడుస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరహరి, ప్రదీప్, నవీన్, శ్రీధర్, నరేందర్, శ్రీకాంత్, పద్మాకర్, కో ఆప్షన్ మెంబర్ కోటగిరి అశోక్, జిల్లా జాగతి అధ్యక్షుడు లక్ష్మణ చారి, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం బాధాకరం

నిర్మల్‌టౌన్: ప్రజా గాయకుడు గద్దర్ మరణవార్త తెలుసుకున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తన గళంతో కోట్ల మంది ప్రజలను గద్దర్ ఉత్తేజపరిచారని, ఆయన మరణం బాధాకరమన్నారు. తన పాటలతో ఉద్యమాలకు ఊపుతెచ్చారని, అట్టడుగు వర్గాలకు గొంతుకై నిలిచారని కొనియాడారు.గద్దర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు.

యోగేష్ స్వామికి స్వర్ణ కంకణ అవార్డు



అవార్డు అందుకుంటున్న యోగేష్ స్వామి

లోకేశ్వరం(ముధోల్): మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన శ్రీమాటపతి యోగేష్ స్వామి స్వర్ణ కంకణ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో లలిత కళా సమాఖ్య సేవ సామాజిక సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్యాతిక పీఠంవారు హరిహర కళా భవన్‌లో అందజేశారు.

ఎమ్మెల్సీకి సత్కారం



సత్యనారాయణతో సంఘం నాయకులు

ఖానాపూర్: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకమైన కుర్రు సత్యనారాయణను ఆదివారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎరుకల సంఘం నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు లోకిని రాము, చిన్నయ్య, శ్రీనివాస్, పోషన్న, గంగన్న, వెంకట్, రాజేశ్వర్, పెంటన్న, ఎర్రన్న, శేఖర్, చిన్న గంగారాం, గంగాపోషయ్య, విజయ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అడవుల జిల్లా మదిలో..

ఆయన గజ్జె కట్టి ఆడితే.. జనం గుండె ఝల్లుమంటుంది.. గొంతు విప్పి పాడితే.. చైతన్యం ఉప్పొంగుతుంది.. మాట్లాడితే అణగారిన వర్గాలకు ఒక ఆశాకిరణం అవుతుంది. ప్రశ్నించే పాట.. అన్యాయాన్ని ఎదురించే మాట ఆయన సొంతం. నక్సల్స్ ఉద్యమం ఊపిరి పోసుకున్న సమయంలో జననాట్యమండలిని స్థాపించిన వారిలో గద్దర్ ఒకరు. బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి తన పాటనే ఆయుధంగా మలుచుకుని ప్రజా యుద్ధ నౌకగా గుర్తింపు పొందిన గద్దర్‌కు ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది ప్రజానాట్యమండలిలో పనిచేశారు. ముఖ్యంగా కోల్‌బెల్ట్ ఏరియాలో సింగరేణి శ్రమదోపిడీని ప్రశ్నించిన గద్దర్ కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నాడు బొగ్గుబాయిలపై ఏ మీటింగ్ నిర్వహించినా ఆయన పాటే మార్మోగేది. ఆదివాసీల తిరుగుబాటు గడ్డ ఇంద్రవెల్లిలో అడుగుపెట్టి గిరి పుత్రులను చైతన్య పరిచారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు. నిర్బంధాలను చీల్చుకుంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలను తన పాటలతో ఏకతాటిపై నడిపించారు. సభలు, సమావేశాలు, ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉద్యమంలో ఎంతో మంది ఈ ప్రాంత కళాకారులు గద్దర్‌తో ఆడిపాడిన సందర్భాలున్నాయి. కొంతకాలంగా గద్దర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో ఆయన కోలుకుంటున్నారని శనివారం రాత్రి ప్రకటన రావడంతో మంచిర్యాల జిల్లాలోని ముఖ్య కళాకారులందరూ సోమవారం శివాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకోవాలని అనుకున్నారు. ఇంతలోనే గద్దర్ ఇక లేరనే వార్త తెలియడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. గద్దర్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ ప్రాంతవాసులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రముఖ సాహితీవేత్త 'సామల'తో స్నేహబంధాన్ని కలిగిన గద్దర్.. సదాశివ వర్ధంతి రోజునే మరణించడం యాదృచ్ఛికం.



- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై గద్దర్ చెరగని ముద్ర
- ఎంతో మందితో సాన్నిహిత్యం
- ప్రజల గొంతుకై గర్జించిన జ్ఞాపకాలెన్నో..
- ధూంధాంతో జనాల్లో చైతన్యం



బెల్లంపల్లిలో..



మంచిర్యాలలో ఆటాపాట..



గూడ అంజయ్యకు నివాళులర్పిస్తూ ..



జిల్లా కళాకారులతో గద్దర్



ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద..

మంచిర్యాల జిల్లాలో...

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/పాతమంచిర్యాల/దండేపల్లి/నస్పూర్:

- మంచిర్యాల బైపాస్ రోడ్ రంగంపేట్ చౌరస్తాలో 2008, జూలై 03న గద్దర్ అమరువీరుల స్థూపానికి శంకుస్థాపన చేయగా, 2014 జూలై 6న తెలంగాణ అమరుల కుటుంబాలతో స్థూపావిష్కరణ గావించారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో గన్‌పార్క్ వద్ద నిర్మించగా మలిదశ ఉద్యమంలో అమరవీరుల త్యాగానికి గుర్తుగా మంచిర్యాలలో నిర్మించారు. ఇంద్రవెల్లి, రాజాగోండు, జోడ్‌ఘాట్, కుమరంభీం, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, బెల్లంపల్లి ప్రాంతం నేలకొరిగిన అమరుల నేల నుంచి మట్టిని తీసుకువచ్చినట్లు నిర్మాణం చేపట్టినట్లు అప్పటి ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ శ్రీమన్నారణయణ తెలిపారు.
- దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన విప్లవ కవి, గాయకుడు గూడ అంజయ్య, 2016, జూన్ 21న మరణించడంతో, ఆయన అంతిమ యాత్రలో పాల్గొనేందుకు జూన్ 22న గద్దర్ లింగాపూర్‌కు విచ్చేశారు. అంజన్నతో తనకు ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 14న నస్పూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ సభలో గద్దర్ పాల్గొన్నారు. ఈ సభలో కళాకారులతో కలిసి ఆడిపాడి అలరించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పాల్గొన్నారు.
- 2023 మే 05న నిర్వహించిన మంచిర్యాలలో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహసభలకు హాజరైయ్యారు. సింగరేణి ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ తలపెట్టిన ఉద్యమంలో భాగంగా బెల్లంపల్లి రీజియన్‌లోని బొగ్గు బావులను సందర్శించి కార్మికుల కష్టసుఖాలను తెలుసుకున్నారన్నారు.
- ఈ ఏడాది జూలై 8న ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజ్ సోదరి రాణి వివాహానికి చివరిసారిగా మంచిర్యాల జిల్లా మందమర్రికి వచ్చిన గద్దర్ రోజంతా గడిపారు. క్యాతన్‌పల్లి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలతో అకట్టుకున్నారు. జిల్లాలోని కళాకారులు ఆయనను కలిసి ఫొటోలు దిగారు.
- 1977 ప్రాంతంలో ఎమర్జెన్సీని ఎత్తివేసిన తర్వాత విప్లవోద్యమ విస్తరణలో భాగంగా బెల్లంపల్లిలో జననాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ సాంస్కృతిక బృందానికి నాయకత్వం వహించిన గద్దర్ తొలిసారిగా బెల్లంపల్లికి వచ్చారు. విప్లవ పాటలతో ఈప్రాంత యువతను విశేషంగా ఆకర్షించారు. ఆ తర్వాత అనేక మంది యువకులు పోరుబాట పట్టారు.
- ప్రజా పోరాటాలు నిర్వహించి విప్లవోద్యమంలో అనేకమంది అమరులయ్యారు. వారి స్మారకార్థం బెల్లంపల్లి టేకులబస్తీ ప్రాంతంలో ప్రధాన రహదారిని ఆనుకుని అమరుల స్మారక స్థూపం నిర్మించారు.1990, ఏప్రిల్ 22న గద్దర్ దానిని ఆవిష్కరించారు.
- ఈ ఏడాది మేలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ప్రజాకవి గూడ అంజయ్య యాదిలో సాంస్కృతిక సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ ఆటపాటలతో అలరించారు.

ఆదిలాబాద్‌తో ఆత్మీయానుబంధం

కైలాస్‌నగర్:

తొలిసారిగా ఇంద్రవెల్లికి ...

తెలంగాణ భాషా, యాస, గోసను తన పాటల ద్వారా కళ్లకు కట్టేలా చాటిచెప్పిన గద్దర్‌కు అమరవీరుల పురిటిగడ్డగా చెప్పుకునే ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. తొలిసారిగా 1984, ఏప్రిల్ 20న అమవీరుల వర్ధంతికి నివాళులర్పించేందుకు బయల్దేరగా, పోలీసులు గుడిహత్నూర్‌లోనే అడ్డుకుని వెనక్కి పంపారు. అప్పట్లో సంచలనం రేకెత్తించింది. 1989లో మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్న సమయంలో జరిగిన అమరవీరుల వర్ధంతిని 50వేల మందితో నిర్వహించగా ఈ కార్యక్రమంలో గద్దర్ ప్రత్యేక అతిథి, వక్తగా హాజరయ్యారు. అప్పటి నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఏ సందర్భంలో వచ్చినా ఇంద్రవెల్లి అమవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి తన ఉద్యమ స్ఫూర్తిని చాటి చెప్పేవారని స్థానిక ఉద్యమకారులు గుర్తు చేసుకుంటున్నారు.

- కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత దివంగత సామాల సదాశివ మాస్టర్‌తో గద్దర్‌కు మంచి స్నేహబంధం ఉంది. జిల్లాకు వచ్చినప్పుడు విద్యానగర్‌లోని సదాశివ మాస్టర్ ఇంటికి వెళ్లి స్నేహపూర్వకంగా గడిపారు. పలు భాషాల్లో పట్టున్న వారిద్దరు సాహిత్యం, తెలంగాణ ఉద్యమంపై మాట్లాడుకునేవారని సదాశివ కుటుంబీకులు తెలిపారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి గండ్రత్ సుజాత తరపున ఆయన ఎన్నికల ప్రచారానికి హాజరయ్యారు. ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో సినీనటి కుష్బూతో కలిసి వచ్చిన ఆయన ఎరోడ్రమ్ నుంచి ఎన్టీఆర్ చౌక్ వరకు నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు.

నిర్మల్ యాదిలో..

నిర్మల్: నిర్మల్ జిల్లాకేంద్రంలో అమరవీరుల స్తూపం, రాంజీగోండు సహా వెయ్యిమంది అమరుల స్తూపం, రాంజీ విగ్రహాన్ని గద్దర్ ప్రారంభించారు.

ఆసిఫాబాద్ ఠాణాలో కేసు..

ఆసిఫాబాద్: గద్దర్‌పై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయడంతో మండలంలోని మోవాడ్‌లో అమరవీరుల స్తూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ హాజరయ్యారు. ఈ క్రమంలో ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు వ్యతిరేకంగా గద్దర్ పాటపాడారు. అప్పటి బెల్లంపల్లి అదనపు ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు గద్దర్‌పై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. గిరిజన పోరాట యోధుడు కొమురంభీమ్ వర్ధంతి కార్యక్రమాలకు సైతం గద్దర్ మూడు, నాలుగుసార్లు హాజరయ్యారు. 2008లో జోడేఘాట్‌కు వెళ్తున్న గద్దర్‌ను కెరమెరి మండలం హట్టి వద్ద అడ్డుకున్నారు.

ఉద్యమ సమయంలో...



తెలంగాణ ఉద్యమ సమయంలో జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గద్దర్ పాల్గొన్నారు. అప్పట్లో ఆయన పాల్గొన్న ప్రతీ కార్యక్రమంలో నేనూ భాగమయ్యాను. తను రాసిన 'కయ్యం పెట్టిందిరో..'పాటకు పేరడిగా మరోపాటను నేను పాడటంతో మెచ్చుకున్నారు.

– ఎలిశెట్టి సుదర్శన్, కళాకారుడు

ప్రోత్సహించేవారు..



తన పాటలతో జానపదానికి కొత్తదనాన్ని తీసుకువచ్చిన ప్రజాగాయకుడు గద్దర్. తెలంగాణ ఉద్యమంలో నిర్మల్‌కు వచ్చిన ప్రతిసారీ తనతో కలిసి పాడే అవకాశం వచ్చింది. ఏ పాటను ఎలా పాడాలో తనలో చూసేవాళ్లం. స్థానిక కళాకారులను గద్దర్ ప్రోత్సహించేవారు.

– శనిగారపు నాగరాజు, కళాకారుడు

తెలంగాణ పాటకు తీరని లోటు..



నేను 1984–86లో ఇంటర్ చదివేటప్పుడు ఆర్ఎస్‌యూ కల్చరల్ సెక్రెటరీగా ఎన్నికయ్యాను. అప్పుడు నిర్వహించిన కార్యక్రమానికి గద్దర్, వరవరరావు హాజరయ్యారు. తన పాటలతో గద్దర్ యువతను బాగా ఆకట్టుకునేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ పలుమార్లు కలిశాం. తన మరణం తెలంగాణ పాటకు తీరనిలోటు.

– ఎర్రవోతు రాజేందర్, గ్రంథాలయసంస్థ జిల్లా చైర్మన్

వీధుల్లోనే బాల్యం..!

- చెత్త కాగితాలు ఏరుతూ కనిపిస్తున్న బాలలు
- బడిబాట పట్టని చిన్నారులు
- అధికారులు ప్రత్యేక దృష్టి పెడితేనే సత్ఫలితాలు



వీధుల్లో చెత్త ఏరుతున్న బాలిక

భైంసాటౌన్(ముధోల్): బడికి వెళ్లాల్సిన బాలలు వీధుల్లో తిరుగుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులతో చెత్తకుప్పల్లో చెత్త ఏరుతున్నారు. ఒకవైపు తమ వయసు పిల్లలు బడికి వెళ్లి చదువుకుంటుంటే, ఎంతోమంది చిన్నారులు వయసుకు మించి పనులు చేస్తూ చదువుకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు ప్రభుత్వం బడిబాట, ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ వంటి కార్యక్రమాలతో బడిబయటి పిల్లలు, అనాథ, వీధిబాలలను గుర్తించి పాఠశాలలు, బాలల సంరక్షణ గృహాల్లో చేర్పిస్తున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరడం లేదు. అధికారులు సైతం ఆయా కార్యక్రమాల సమయంలోనే బడిబయటి పిల్లలు, వీధి బాలలను గుర్తిస్తున్నారు. ఆ తర్వాత వారి పనుల్లో నిమగ్నమవుతున్నారు. దీంతో బడిబాట పట్టిన పిల్లలు తిరిగి చెత్త ఏరుతూ దర్శనమిస్తున్న సందర్భాలున్నాయి.

తాత్కాలిక ఉపాధి కోసం...

బడిబయటి, వీధిబాలల్లో ఎక్కువగా రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందినవారే ఉంటారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కుటుంబపోషణలో చేదోడువాదోడు కోసం పిల్లలను పనుల్లో కుదర్చడం, చెత్త ఏరిపించడం వంటి పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రస్తుతానికి తాత్కాలికంగా ఉపాధి పొందినా, పిల్లలను చదువుకు దూరం చేస్తున్నామనే భావన వారిలో కొరవడింది. ఫలితంగా ఎంతోమంది పిల్లలకు చదువుకోవాలని ఉన్నా, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పొట్టకూటి కోసం చాకిరీ పనులు చేస్తున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం నిర్బంధ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు అమలు చేస్తున్నా, తల్లిదండ్రుల్లో అవగాహన లోపం కారణంగా చాలామంది చదువుకు దూరమవుతున్నారు.

నిరంతర పర్యవేక్షణతో...

ప్రభుత్వం ఏటా ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం పేరిట బడిబయటి పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తోంది. అలాగే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ పేరిట ఏటా రెండుసార్లు వీధిబాలల గుర్తింపు కార్యక్రమం చేపడుతున్నారు. ఇందులో భాగంగా పోలీసు, స్త్రీశిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, కార్మిక శాఖ, బాలల సంరక్షణ అధికారులు కలిసి వీధి బాలలు, అనాథ పిల్లలు, తప్పిపోయిన బాలలను గుర్తించి వారిని బాలల సంరక్షణ గృహాలకు తరలించడం, బడుల్లో చేర్పించడం చేస్తున్నారు. అలాగే పనిచేసే ప్రాంతాల్లో తనిఖీలు జరిపి బాల కార్మికులు ఉంటే వారికి పనినుంచి విముక్తి కల్పిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నెలరోజులపాటు చేపట్టే కార్యక్రమాలతో ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఫలితంగా ఇప్పటికీ ఎంతోమంది పిల్లలు వీధుల్లో చెత్త ఏరుతూ కనిపిస్తున్నారు. బడిబయటి పిల్లలపై నిరంతర పర్యవేక్షణతోనే సత్ఫలితాలు పొందవచ్చన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

సమాచారమివ్వాలి

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ పేరిట వీధిబాలల గుర్తింపు కార్యక్రమం చేపట్టాం. బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. ఇంకా బడిబయట బాలలు కనిపిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి సమాచారమివ్వాలి. లేదా స్థానిక ఐసీడీఎస్ అధికారులను సంప్రదించాలి.

– విజయలక్ష్మి, జిల్లా సంక్షేమశాఖ అధికారి

నిలకడగా కడెం నీటిమట్టం



కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ)అడుగులు కాగా ప్రస్తుతం 690.300 (5.324 టీఎంసీ)అడుగుల నీటిమట్టం ఉంది. ఎడమ కాలువకు 755 క్యూసెక్కులు, కుడి కాలువకు 6 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రజల్లోకి పార్టీలు..

- 'అసెంబ్లీ' తర్వాత జోరు..
- ఇప్పటికే జనాల్లోకి అభ్యర్థులు
- పెరుగుతున్న ఆశావహులు
- పోటాపోటీగా ప్రచారాలు

నిర్మల్: అసెంబ్లీ సమావేశాలు పూర్తికాగానే జిల్లాలోనూ ఎన్నికల వాతావరణం మొదలు కానుంది. అధికార బీఆర్ఎస్ పథకాలతో, బీజేపీ, కాంగ్రెస్ సమస్యలతో ప్రజల్లోకి వెళ్ళేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే పలువురు నేతల పాదయాత్రలు, సమావేశాల్లో మాటల తూటాలు వేడిని పెంచుతున్నాయి. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ మూడింట్లో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ యోచిస్తోంది. ఈసారి ఎలాగైనా కారును మట్టికరిపించాలన్న లక్ష్యంతో బీజేపీ, కాంగ్రెస్ కదులుతున్నాయి. ప్రధానంగా ఈ మూడు పార్టీల మధ్యే పోటీ కనిపిస్తుండగా బీఎస్పీ, ఆప్‌లు బరిలో నిలువనున్నాయి. ఎంఐఎం పోటీలో ఉంటుందా? లేదా? అనేదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

'పథకం' ప్రకారం..

వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ మూడోసారీ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలన్న లక్ష్యంతో పావులు కదుపుతోంది. ఇందులో భాగంగానే అన్నివర్గాలకూ లబ్ధి చేకూర్చేలా పనులు చేస్తోంది. రూ.లక్ష రుణాలు, వీఆర్ఏ, ఆర్టీసీ విలీనాలు ఇలా రోజుకొక శుభవార్తలు చెబుతూ ఆయా వర్గాలను తమతోనే ఉండేలా ప్లాన్ చేస్తోంది. ఖానాపూర్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు అక్కడి నుంచే టికెట్ ఆశిస్తూ ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిన జాన్సన్ నాయక్, పూర్ణచందర్‌నాయక్, జనార్దన్ రాథోడ్, తదితరులూ ప్రభుత్వ పథకాలనే వల్లెవేస్తున్నారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రతీ కార్యక్రమం, సమావేశంలో పథకాల అమలును చెబుతున్నారు. ముధోల్‌లో మాత్రం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందంటూ మరోవర్గం తెరపైకి వస్తోంది. వాళ్లూ ఇటీవల గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

మీకోసం వస్తున్నాం..

వరుస ఓటములతో ఢీలాపడ్డ కాంగ్రెస్ కర్ణాటక ఎన్నికల్లో విజయంతో కొంత కోలుకుంది. అదే ఊపుని జిల్లాలో కొనసాగిస్తామంటోంది. సీనియర్లు దూరమైనా కొత్త రక్తం రావడంతో కొంత ఉత్సాహం కనిపిస్తోంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో కూచాడి శ్రీహరిరావు వస్తున్నా.. 'మీకోసం' పేరిట యాత్ర ప్రారంభించారు. గ్రామ గ్రామానికి వెళ్తూ సర్కారుతీరును ఎండగడుతూ, మంత్రిపై విరుచుకుపడుతున్నారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ సభ్యురాలు చారులత, ఏఐసీసీ రీసెర్చ్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ యాక్టివ్‌గా తిరుగుతున్నారు. ఎవరికి వారు టికెట్ తమదేనన్న ధీమాతో ప్రజల్లోకి వెళ్తున్నారు. అధికార పార్టీని టార్గెట్ చేస్తున్నారు. ముధోల్‌లో మాత్రం కాంగ్రెస్ ఇంకా కోలుకోలేదు. ఇక్కడ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రామారావుపటేల్ బీజేపీలో చేరిన తర్వాత సరైన నాయకుడు రాలేదు. కిరణ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్, తుల సుభాష్ ఫౌండేషన్ చైర్మన్ తుల సుభాష్, తదితరులు ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేలు వస్తున్నారు..

ఎలాగైనా ఈసారి రాష్ట్రంలో పాగావేయాలన్న దూకుడుతో వెళ్తున్న బీజేపీ జిల్లాపైనా భారీ ఆశలు పెట్టుకుంది. ఇక్కడ మూడింట మూడు గెలిచే స్థానాలుగా ఆశిస్తోంది. పార్టీ అధిష్టానం వివిధ రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్యేలను రప్పిస్తోంది. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకూ వీరు రానున్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పార్టీ బలోపేతంతో పాటు స్థానిక పరిస్థితులు అంచనా వేయనున్నారు. ఇక నిర్మల్‌లో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ముధోల్‌లో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సీనియర్లు రామారావుపటేల్, మోహన్‌రావుపటేల్, ఖానాపూర్‌లో రమేశ్ రాథోడ్, జెడ్పీటీసీ సభ్యురాలు జానుబాయి, హరినాయక్, సట్ల అశోక్ ప్రజల్లోకి వెళ్తున్నారు.

క్లుప్తంగా

ఉమ్రీలో కార్డెన్‌సర్చ్



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ ప్రేంకుమార్

నార్నూర్: మండలంలోని ఉమ్రీ గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి వాహనాలు తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 12 బైక్‌లు, జరిమానా చెల్లించని బొలెరో వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ ప్రేంకుమార్ మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట వాహనపత్రాలు ఉంచుకోవాలన్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎస్సైలు రవికుమార్, మహేశ్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయం చేస్తూనే మూడు ఉద్యోగాలు..



శ్రీనివాస్ (ఫైల్)

సారంగపూర్: ఆయనది వ్యవసాయ కుటుంబం. అటు చదువుతూనే, ఇటు పొలం పనులు చేస్తూనే మూడు ఉద్యోగాలు సాధించాడు. అయినా అవి తనకు సరిపోదని సివిల్ ఎస్సైగా ఉద్యోగం సాధించాడు మండలంలోని మలక్‌చించోలికి చెందిన సామ శ్రీనివాస్. ఆదివారం వెల్లడించిన ఎస్సై ఫలితాల్లో సత్తా చాటాడు. సామ హన్మంతు–పర్వవ్వ దంపతులకు ముగ్గురు కుమారులు. పెద్దవాడైన ప్రవీణ్, రెండో కుమారుడు నవీన్. మూడో కుమారుడు శ్రీనివాస్ చదువుతూనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. మొదట వీఆర్వో రాగా, ప్రభుత్వం వేరే శాఖల్లో విలీనం చేయడంతో ఆయనకు ఫైర్ సర్వీసెస్‌లో ఉద్యోగం వచ్చింది. రెండోసారి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా సెలక్ట్ అయ్యాడు. ఇది నచ్చక ఎస్సైగా ప్రిపేర్ అయి పరీక్ష రాస్తే సివిల్ ఎస్సైగా బాసర జోన్ సర్కిల్‌లో ఉద్యోగాన్ని సాధించాడు.

ఆర్మీ హవల్దార్ టూ సివిల్ ఎస్సై



తోట రమేశ్

నర్సాపూర్(జి): సివిల్ ఎస్సై ఫలితాల్లో మండలంలోని గొల్లమాడకు చెందిన తోట రమేశ్ సత్తా చాటారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన తోట చిన్న లస్మన్న–లస్మవ్వ దంపతుల కుమారుడు రమేశ్ 16 ఏళ్లపాటు ఇండియన్ ఆర్మీలో హవల్దార్‌గా సేవలందించి 2020 నవంబర్‌లో రిటైరయ్యారు. అనంతరం రెండున్నర ఏళ్లుగా కష్టపడి చదువుతూ ఎస్సై పరీక్షకు ప్రిపేరయ్యారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో సివిల్ ఎస్సై ఉద్యోగం సాధించారు. కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమని నిరూపించారు. గ్రామస్తులు, మండల వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన యువతి శనివారం రాత్రి అదృశ్యమైనట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. యువతి సోదరుడి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆధునిక హంగులతో రైల్వే అభివృద్ధి



వర్చువల్ విధానం ద్వారా పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ

- వర్చువల్ ద్వారా ఏబీఎస్ఎస్ ప్రారంభించిన ప్రధాని
- ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో మెరుగైన వసతులు
- ఇదివరకే పిట్‌లైన్, రైల్వే బ్రిడ్జిల మంజూరు
- ఆదిలాబాద్ – ఆర్మూర్‌రైల్వే లైన్ దిశగా అడుగులు
- రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్టేషన్‌గా మార్చేందుకు చర్యలు
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్: జిల్లాలోని రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపూరావు అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద ఎంపిక కాగా, ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైల్వే అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలను దూరం చేసేలా ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. గతంలోని ప్రభుత్వాలు జిల్లాలో రైల్వే వ్యవస్థను పూర్తిగా విస్మరించాయని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. 'అమృత్ భారత్ పథకం' కింద దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుందని, ఇందులో భాగంగా ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ రూ.17.8 కోట్లతో అభివృద్ధి జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎం రితీష్ కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు మయూర్ చంద్ర, విజయ్ భోయర్ పాల్గొన్నారు.

త్వరలోనే మరో శుభవార్త..

జిల్లా ప్రజలకు ఎనిమిది రోజుల్లో మరో శుభవార్త చెప్పడం జరుగుతుందని ఎంపీ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వే లైన్ దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ఈ విషయమై రైల్వే లైన్ గురించి విజ్ఞప్తులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ రైల్వే నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు దూరభారం తగ్గడంతో పాటు ఎన్నో నూతన రైళ్ల రాకపోకలు జిల్లా మీదుగా సాగుతాయని తెలిపారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్టేషన్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావు

ప్రణాళికాబద్ధంగా ముందుకు..

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అధికారులతో కలిసి ప్రణాళికా బద్దంగా ముందుకు సాగుతున్నాం. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ పథకం ద్వారా రైల్వే స్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– జీవీ రమణ, దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్

మోదీ హయాంలో రైల్వే అభివృద్ధి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో రైల్వే రూపు రేఖలు మారి అనేక రకాలుగా అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ఎంతో ఆధునీకరించబడింది. ప్రస్తుతం ఏబీఎస్ఎస్ ద్వారా మరో అడుగు అభివృద్ధి వైపు పడింది. గతంలో జిల్లా వాసులు నాసిరకమైన సదుపాయాలతో ఎన్నో తిప్పలు పడేవారు. ప్రస్తుతం ఆ సమస్యలన్నీ తొలగిపోయాయి.

– పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్

ఉద్యోగాల పేరిట మోసం

నిర్మల్‌టౌన్: ప్రభుత్వ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడని ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కొత్తపల్లికి చెందిన రామకృష్ణ, నిర్మల్ పట్టణానికి చెందిన పలువురికి ప్రభుత్వ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన దీపక్, తన స్నేహితులైన ఐదుగురితో రూ.21 లక్షలు ఇప్పించాడు. కొన్ని నెలలు గడుస్తున్నా ఉద్యోగాల విషయంపై స్పందించకపోవడంతో దీపక్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

'స్వరాజ్య కాంక్షనే లక్ష్యం'



ఉత్సవాలో పాల్గొన్న నాయకులు

నేరడిగొండ: స్వరాజ్య కాంక్షను కలిగించమే లక్ష్యంగా ధర్మసమాజ్ పార్టీ ముందుకెళ్తుందని మండల నాయకుడు గాజుల శ్రీకాంత్ అన్నారు. డాక్టర్ విశారదన్ మహరాజ్ 10వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్ర మండల కేంద్రానికి చేరుకుని ఏడాది గడిచిన సందర్భంగా ఆదివారం సంస్మరణ ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల కోసమే ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. అంతకుముందు ధర్మ సమాజ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

టీకా వేయించారా?

- క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే
- నేటి నుంచి మిషన్ ఇంద్రధనుష్



నేరడిగొండ: కరోనా సృష్టించిన కల్లోలంతో 'వ్యాధి నిరోధక టీకా'పేరు బాగా ప్రాచుర్యం పొందింది. కోవిడ్ టీకాను పక్కనబెడితే పుట్టిన పిల్ల నుంచి 16 ఏళ్లలోపు వారందరికీ వివిధ రకాల వ్యాధుల నివారణకు వ్యాక్సినేషన్ తప్పనిసరి. గర్భిణులు సైతం విధిగా టీకా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే టీకాలు తీసుకోకుండా మిగిలిన వారికోసం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 'మిషన్ ఇంద్ర ధనుష్' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల 7 నుంచి అక్టోబర్ 14 వరకు మూడు విడతల్లో టీకాలు ఇవ్వనున్నారు.

వంద శాతం వ్యాక్సినేషనే లక్ష్యం..

చిన్నారులు, గర్భిణులు వందశాతం వ్యాక్సినేషన్ తీసుకోవాలే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందుకోసం జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా తిరుగుతున్నారు. అందరి వివరాలు సేకరిస్తున్నారు. 16 ఏళ్లలోపు వారికి ఎన్ని టీకాలు వేయించారు? గర్భిణులకు వ్యాక్సినేషన్ జరిగిందా..? తదితర వివరాలు ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. చిన్నారుల్లో బీసీజీ, హెచ్‌బీ, ఓపీవీ జీఓ, టీపీవీ 1–3, రోటా వైరస్, పెంటావాలెంట్, ఐపీవీ, విటమిన్–ఏ తదితర టీకాలు నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం తీసుకోవాల్సి ఉంటుంది. గర్భిణులు టీటీ–1, టీటీఏ–2, టీటీ బూస్టర్ టీకాలు తీసుకోవాలి. ఇదివరకు తీసుకోని 16 ఏళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు మిషన్ ఇంద్ర ధనుష్ సిబ్బంది సూచనల మేరకు వేయించుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మూడు విడతలుగా..

వాస్తవానికి ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వ్యాక్సినేషన్ నిరంతరం కొనసాగుతోంది. అయినప్పటికీ వివిధ కారణాలతో 5 నుంచి 8 శాతం మంది పలు రకాల టీకాలు తీసుకోవట్లేదని తేలింది. ఇలాంటి వారికోసం మూడు విడతలుగా టీకాలు వేయనున్నారు. మొదటి విడతగా ఈనెల 7 నుంచి 12 వరకు, రెండో విడతలో సెప్టెంబర్ 11 నుంచి 16, మూడో విడతలో అక్టోబర్ 9 నుంచి 14 వరకు టీకాలు ఇవ్వనున్నారు. ఆశవర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఇదివరకు తీసుకోని 16 ఏళ్లలోపు పిల్లలకు టీకాలు ఇవ్వనున్నారు.

పోర్టల్‌లో నమోదు..

మిషన్ ఇంద్ర ధనుష్‌లో భాగంగా వ్యాక్సినేషన్ చేయాల్సిన వారి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం (యూఐపీ) యూవిన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎప్పుడు ఎవరికి టీకా ఇచ్చారు? తిరిగి మళ్లీ ఎప్పుడు వేయాలి? తదితర వివరాలు పూర్తిగా యాప్‌లో నిక్షిప్తం కానున్నాయి. టీకా పొందినవారు విధిగా ధ్రువపత్రం పొందే వెసులుబాటు ఉండనుంది. ఇదే అంశంపై ఇటీవల జిల్లా కేంద్రంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం సైతం నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు, సిబ్బంది శిక్షణకు హాజరయ్యారు.

ప్రజలు సహకరించాలి



మిషన్ ఇంద్రధనుష్‌లో భాగంగా వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. ప్రజలు పూర్తి వివరాలు తెలియజేయాలి. టీకాలు తీసుకోని వారిని గుర్తించి మూడు విడతల్లో వ్యాక్సినేషన్ చేస్తాం. ఇవి తప్పనిసరి. మా సిబ్బందికి సహకరించాలి.

– వైసీ శ్రీనివాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, ఆదిలాబాద్

సామాజికసేవలో 'వరల్డ్ విజన్'

- జిల్లాలో ఇప్పటికే సేవా కార్యక్రమాలు
- లక్ష్మణచాంద మండలం దత్తత
- ప్రాథమిక పాఠశాలలకు చేయూత



నిర్మల్ ఏరియా ఆసుపత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందచేస్తున్న సంస్థ సభ్యులు (ఫైల్)



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి (ఫైల్)

లక్ష్మణచాంద: ఒక మంచి పనిచేస్తే పది మందికి తెలిసేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు చేసుకోవడం సాధారణంగా మనం చూస్తుంటాం. కానీ వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఎలాంటి హంగు ఆర్భాటాలకు పోకుండా సామాజిక సేవలో ముందుంది. ఇప్పటికే జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. 2021 ఫిబ్రవరిలో లక్ష్మణచాంద మండలాన్ని దత్తత తీసుకుంది. టుగెదర్ ఫర్ చిల్డ్రన్స్, చేంజ్ ఫర్ చిల్డ్రన్స్ లైఫ్ అనే నినాదంతో సంస్థ ముందుకెళ్తోంది.

వరల్డ్ విజన్ సభ్యులు చేపట్టిన సేవలు..

లక్ష్మణచాంద మండలంలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు ఆట వస్తువులు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. కరోనా సమయంలో 980 కుటుంబాలకు ఆర్థికసాయం పంపిణీ చేశారు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి 25 బెడ్లు, 5 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్, మాస్కులు, ఆక్సీమీటర్లు, శానిటైజర్లు, ఇన్‌ఫ్రామిడ్ మీటర్లు, లక్ష్మణచాంద పీహెచ్‌సీకి 5 బెడ్స్,2 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ అందజేశారు. మండలంలోని 1500 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, స్పోర్ట్స్' మెటీరియల్స్ అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు, 15 మంది దివ్యాంగుల కుటుంబాలకు గొర్రెలు కొనుగోలు చేసి ఇచ్చారు.

సేవలు అభినందనీయం



మండలంలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించారు. సంస్థకు మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు.

– అద్వాల పద్మ, ఎంపీపీ

మరింత సేవ చేయాలి



లక్ష్మణచాంద మండలంలో చేపడుతున్న వరల్డ్ విజన్ సంస్థ సేవలను ప్రజలు ఎన్నటికి మర్చిపోరు. సంస్థ ద్వారా మరింత చేయూత అందిచాలని కోరుతున్నా.

– ఎర్ర రఘునందన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్

సేవలందిస్తాం



నిర్మల్ జిల్లాలో కరోనా నుంచి ఇప్పటి వరకు రూ.2కోట్లతో సేవలు అందించాం. జిల్లా వా సులు, లక్ష్మణచాంద మండల ప్రజల కోసం మరింత సేవలందిస్తాం. పిల్లల అభ్యున్నతికి వరల్డ్ విజన్ సంస్థ కృషి చేస్తోంది.

– బ్రహ్మన్న, జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ వరల్డ్ విజన్

ఆదివాసీలు అమాయక జీవులనేది..

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు



గద్దర్‌తో ఆత్రం భుజంగ్‌రావు

ఉట్నూర్‌రూరల్: 'ఆదివాసీలు అమాయక జీవులు.. చైతన్యపరులై సమాజానికి సరిసమానంగా మెలగాలనే తపన గద్దరన్నది.. ఈ ప్రాంతంపై ఆయనకున్న ప్రేమానురాగాలు మరువలేనివి.. ఎప్పుడు కలిసిన మీరు మారాలి.. అభివృద్ధి పథంలో నడవాలి.. అంటూ ఆయన పాడిన పాటలు, ఇక్కడి వారిని చైతన్యపరిచేవి..' అని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. గద్దర్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నాడు. 1983–84లో పెద్దపల్లిలో ఆర్ఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలతో ఉన్నప్పుడు ఆయనతో పరిచయం ఏర్పడింది. 1992–93లో తొలిసారిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. జోడేఘాట్ సందర్శన, ఇంద్రవెల్లి సభల్లో పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంత సందర్శనలో ఇక్కడి పరిస్థితులు పరిశీలించి మోసపోతున్న గిరిజనులను పాటల ద్వారా చైతన్యపరిచారు. 2008–09లో తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయ జేఏసీగా ఉన్న తాము గద్దర్‌తో కలిసి ఆదివాసీ ప్రాంతాలైన ఉట్నూర్, హస్నాపూర్, దేవుగూడ, సిర్పూర్–యూ మండలం మామిడిపల్లి గ్రామాల్లో కలిసి సందర్శించామన్నారు. నేను చివరిసారిగా మార్చి 10, 2023న ఆర్టీసీభవన్ హైదరాబాద్‌లో నిర్వహించిన 'భారత్ బచావో' కార్యక్రమంలో కలిశాను. ఆయనతో గడిపిన క్షణాలు ఎప్పటికి మరువలేనివి.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



మాట్లాడుతున్న పూసం సచిన్

ఎదులాపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈనెల 9న అన్ని గ్రామాల్లో ఆదివాసీలు ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఈనెల 1 నుంచి 15 వరకు ఆదివాసీ దినోత్సవాలు నిర్వహించాలని తెలిపారు. 9న ప్రతి గ్రామంలో ఆదివాసీ జెండా ఎగరాలని, ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలన్నారు. మణిపూర్ రాష్ట్రంలోని ఆదివాసీల రక్షణకు కేంద్రం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు మడవి నాగోరావ్, సహాయ కార్యదర్శులు ఆడ అర్జున్, జిల్లా కమిటీ సభ్యుడు మేస్రం మహేశ్ పాల్గొన్నారు.

పంట ధ్వంసం చేసిన వారిపై కేసు

నెన్నెల: గుండ్లసోమారం గ్రామానికి చెందిన రత్నం మల్లయ్య, రత్నం అరుణ్‌కుమార్‌లపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన రత్నం పోశంకు చెందిన చేనులోని పత్తి మొక్కలను ధ్వంసం చేయడంతోపాటు, చంపుతామని బెదిరించడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గ్రామాలకు ఏజెన్సీ హోదా కల్పించాలి



రాష్ట్రపతి భవనం వద్ద ఆదివాసీ సేన నేతలు

ఆదిలాబాద్‌రూరల్: నాన్ షెడ్యూల్ గ్రామాలకు ఏజెన్సీ హోదా కల్పించడంతోపాటు జిల్లా అటానమస్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ సేన నేతలు కోరారు. ఆదివారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి విన్నవించారు. 1950 నుంచి అనేక గ్రామాలకు ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ఏరియా పరిధిలో లేకపోవడంతో ఆదివాసీలు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం కోల్పోవల్సి వస్తుందన్నారు. గిరిజన అభివృద్ధి, రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వాలు సరైన నివేదిక సమర్పించకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాడే వెంకటేశ్వర్లు, కోశాధికారి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీకి చెందిన మెండపల్లి గంగన్న (23) చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. మృతుడు గంగన్న అదే కాలనీకి చెందిన జాదవ్ సంతోష్, పందిగుట్ట అశోక్‌లు కలిసి తిరిగేవారు. వారి వద్ద నుంచి గంగన్న రూ. 50వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో అప్పు చెల్లించాలనడంతో జాప్యం చేశాడు. సంతోష్, అశోక్‌లు బుధవారం గంగన్న ఇంటికి వెళ్లగా తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో దాడి చేశారు. రెండు రోజుల అనంతరం శుక్రవారం గంగన్నకు వాంతులు, కడుపు నొప్పి రావడంతో కుటుంబీకులు రిమ్స్‌కు తరలించగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. సంతోష్, అశోక్ దాడిలో తన కుమారుడు మృతిచెందారని తండ్రి సాయన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నిర్మల్‌టౌన్: రోడ్డు దాటుతుండగా మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ పురుషోత్తం కథనం ప్రకారం.. బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న రాజధాని బస్సు..రోడ్డు దాటుతుండగా జాదవ్ కవితను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ వినోద్ ఫిర్యాదుతో డ్రైవర్ హుస్సేన్‌పై కేసు నమోదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది పరిధి వాగాపూర్ ఎక్స్‌రోడ్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారి గుండా వెళ్తున్న కంటైనర్ డ్రైవర్ అప్రమత్తతతోనే ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ వైపు నుంచి హైదరాబాద్‌కు ఆదివారం కంటైనర్ వెళ్తోంది. ఆ సమయంలో అటుగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురు ఒక్కసారిగా అడ్డుగా వచ్చారు. డ్రైవర్ అప్రమత్తతతోనే డివైడర్ ఎక్కించడంతో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్, బైక్‌పై వెళ్తున్న ముగ్గురు క్షేమంగా బయటపడ్డారని ఎస్సై ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. కాగా. కంటైనర్ డ్రైవర్ ధైర్యానికి సోషల్‌మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- జీసీడీవో ఛాయ



విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీవో ఛాయ

నార్నూర్: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జీసీడీవో ఛాయ అన్నారు. గాదిగూడ మండలంలోని అర్జుని బాలికల ఆశ్రమ పాఠశాలతోపాటు కొలాంగూడ శాటిలైట్ సెంటర్‌ను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పాఠశాలలో వసతి గృహాలతోపాటు వంట గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డార్మెంటరీ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆమె వెంట వార్డెన్‌లు అశోక్, బాబు తదితరులు ఉన్నారు.